# బహుమతి

రచన:
శ్రీ చింతలూరి వల్లిబాబు

ఎత్తయిన కొండల మధ్యనుంచి ప్రవహిస్తున్న గోదావరీ ప్రవాహాన్ని చూస్తుంటే, అందమైన యువతి ఉన్నత ఉరోజాల నడుమ అలవోకగా చిందులాడే పైట దృశ్యం జ్ఞాపకమొస్తోంది. మృదువుగా వచ్చి తాకుతున్న చల్లని పవనం ప్రియురాలి కోమలమైన స్పర్శని స్ఫురింపచేస్తోంది. జలప్రవాహాన్ని కోసుకుంటూ ప్రయాణీకుల లాంచీ ముందుకు దూసుకుపోతూంది. నేను క్యాబిన్ రూంలో కూర్చుని పరిసర దృశ్యాలు పరిశీలిస్తున్నాను.

ఆ లాంచీలో జనం అంతగా లేరు. అక్కడక్కడ రేవుల్లో ఎక్కుతున్నవాళ్ళు, దగ్గర దగ్గర రేవుల్లోనే దిగిపోతున్నారు. కొందరు మాత్రం లాంచీ టాపుమీద జేరి పేకాట జోరుగా సాగిస్తున్నారు. వాళ్ళు కూడా నాలాగే, దూరప్రయాణీకులు కావచ్చు. నేను కొంతసేపు పత్రికలు చదవడం, మరికొంతసేపు ప్రకృతిని తిలకించడం చేస్తున్నాను.

ప్రయాణం క్రమక్రమంగా విసుగనిపిస్తోంది. ఎవరైనా తెలిసిన వ్యక్తి, నా అభిరుచుల కనుగుణమైన వ్యక్తి, ఎక్కడైనా లాంచీలో ఎక్కితే బాగుండు ననిపిస్తోంది. సరదాగా మాట్లాడుకొంటూ కాలక్షేపం చెయ్యొచ్చు... అందుకని లాంచీ ఏ రేవులో ఆగితే, ఆ రేవులో ఎక్కే ప్రయాణీకుల్ని ఆసక్తిగా పరికిస్తున్నాను. ఎంతకీ అల్లాంటి వ్యక్తులు తటస్థించడం లేదు. ఆఖరుకు విసుగెత్తి సూట్‌కేసులోంచి నవలొకటి తీసి - అది ఇంతకుముందే చదివిందైనప్పటికీ - కాలాన్ని చంపడం కోసం - పట్టుదలగా దాన్ని మళ్ళీ పఠించడం ప్రారంభించాను.

కొంతసేపటికి దట్టమైన కొండలమధ్య ఒక రేవు సమీపించింది. ఏటవాలుగావున్న కొండ మీద పర్ణశాలల్లావున్న పాతిక ముప్పై గుడిశలు కనిపించాయి. అవి కొండరెడ్లవో-కోయలవో అయి వుంటాయి. ఆ యిళ్ళల్లోంచి పిల్లలు, పెద్దలు బిల-బిల మంటూ బయటికి వచ్చారు - లాంచీ వచ్చి వాళ్ళ రేవులో ఆగగానే. లాంచీలోంచి కొందరు గిరిజనులు మూటా-ముల్లెతో అక్కడ దిగిపోయారు. ఇంతలో అక్కడ గుంపుగూడిన బాల-బాలికల మధ్యనుంచి దారి చేసుకొని ఒక నవనాగరిక యువతి ఒక సూట్‌కేసుతో, ఒక ప్లాస్టిక్ బ్యాగ్‌తో వచ్చి లాంచీ ఎక్కింది. లాంచీ కదులుతూంటే ఆ పిల్లలంతా సంతోషంగా చేతులూపుతూ ఆమెకు వీడ్కోలు చెప్పారు. ఆమె నాకు స్పష్టంగా కన్పించలేదు. కాని ఆమెని ఇంతకుముందు ఎక్కడో చూసినట్లే వుంది.

లాంచీ ఆ రేవులోంచి కదిలి ముందుకు సాగడంతో, ఆ యువతి రేవులోని పిల్లల వైపునుంచి దృష్టి మరల్చి, లాంచీలోని ప్రయాణీకుల మీద ప్రసరించింది. లాంచీ ముందుభాగంలో బోలెడు లగేజీ, కొంతమంది రైతులూ, వ్యాపారస్తులూ, కావలసినంత పామర జనం వున్నారు. చుట్ట పొగలూ, సిగరెట్ దమ్ములూ, మాటలూ, నవ్వులూ అంతా గొడవ-గొడవగా ఉంది.

ఆమెకి ఆ వాతావరణం నచ్చనట్లుగా వుంది. కళ్ళెత్తి క్యాబిన్‌వైపు చూసింది. అందులో నేనొక్కన్నే ఉండడం గమనించి, తన సూట్‌కేస్, ప్లాస్టిక్ బ్యాగ్‌తో నా దగ్గరకు వచ్చింది. అప్పుడు చూశాను ఆమె ముఖాన్ని స్పష్టంగా. ఆమె సువర్చలే!

ఆమె కూడా నన్ను గుర్తు పట్టింది.

"హలో, సౌమిత్రీ! మీరా?" అంది ఆశ్చర్యంగా.

"వండర్.... నువ్వా సువర్చలా?" అన్నాను సంతోషంగా.

ఆమె వచ్చి నా ప్రక్కనే సీటుమీద కూర్చుంది.

ఇది కలా-వాస్తవమా అనిపిస్తోంది నాకు.

ఎక్కడి సువర్చల ఎక్కడి నేను....ఎన్నాళ్ళ ఎడబాటు? ఇన్నాళ్ళకి, ఇక్కడ, తలవని తలంపుగా, ఒకర్నొకరు కలుసుకోవడం - ఎంత విచిత్రం!

నాలుగైదు సంవత్సరాల నాటి విషయం ...అప్పుడు నేను మా వూరికి సమీపంలో వున్న కాలేజీలో చదువుతున్నాను. సువర్చల కూడ అదే కాలేజీలో చదివేది. నా

కంటే ఒక సంవత్సరం జూనియర్, ఆమె అప్పట్లో అద్భుతంగా పాడేది. కాలేజీ కల్చరల్ ప్రోగ్రామ్సులో పాల్గొనేది. అందుకే ఆమె అందరికీ తొందరగానే పరిచయం అయిపోయింది. నాకు కూడా ఆమె మొదట ఆ విధంగానే పరిచయం అయినప్పటికీ—ముఖ్యంగా ఆమె విషయంలో నన్నాకర్షించిన అంశం వేరే వుంది. అందుకే ఆమెని విడువలేక, ఆమెని కావాలని పరిచయం చేసుకొని, స్నేహ సాన్నిహిత్యాలు సంపాదించాను.

కాని సువర్చలని పూర్తిగా అర్థం చేసుకోవడం కుదరలేదు. ఆమె అందరికి మల్లేనే నాతో కూడా ఫ్రీగా వుండేది. ఎంత అభిమానమున్నా, ఎంత ఆకర్షణ వున్నా, ఆమెకి అనుకున్నంత చేరువలోకి వెళ్ళలేక పోయాను. నా వ్యక్తిత్వమో, నా సాహసం లేని మనస్తత్వమో అప్పట్లో నాకర్థం కాలేదు.

ఏ వస్తువైనా అందుబాటులో ఉన్నంతవరకూ దాని విలువ తెలియదు ఎవరికైనా. అలాగే నాకు కూడా ఆ సమయంలో సువర్చల ప్రభావం అర్థం కాలేదు.

వేసవి సెలవుల అనంతరం నేను మూడవ సంవత్సరం డిగ్రీ క్లాసులో చేరినప్పుడు, సువర్చల యథాప్రకారం రెండవ సంవత్సరం డిగ్రీ కోర్సులో చేరలేదు. నాకెక్కడలేని ఆశాభంగం కలిగింది. ఆ కాలేజీ ఒక్కసారి పూర్తిగా చిన్నబోయి నట్లనిపించింది. ఆ వాతావరణం ఎంతో నిరుత్సాహంగా కనిపించింది.

ఆమె కోసం వాకబ్ చేశాను. సరైన సమాచారం లభించలేదు. ఆమె ఇంత హఠాత్తుగా మధ్యలోనే చదువు మానివేసి, ఎక్కడికి వెళ్ళిపోయిందో! ఆమె కేదయినా తీవ్రమైన జబ్బు చేసిందో! లేక ఎవర్నయినా పెళ్ళాడి, దూరంగా ఎక్కడికయినా వెళ్ళిపోయిందో! ఏమీ అర్థం కాలేదు.

నాకు మాత్రం ఆమెని మరచిపోవడం సాధ్యం కాలేదు. ఆమె కోసం ఆలోచిస్తూనే, ఆవేదన చెందుతూనే ఆ సంవత్సరం కాలేజీ చదువు పూర్తి చేశాను. ఆ తరువాత అసంఖ్యాక నిరుద్యోగుల్లో నేనూ ఒక నిరుద్యోగి నయ్యాను.



SRI SRINIVASA FOUNDRY
Amman Kulam Street, COIMBATORE- 641 037.

ఆ సమయంలో కూడా సువర్చల స్మృతులు నన్ను వదలి పెట్టలేదు. ఆమె వియోగం నన్ను విడువలేదు. ఏదో దిగులు, ఏదో నిరాశ ఎప్పుడూ నన్ను వెంటాడడం మొదలు పెట్టాయి. ఆమెవైపు నుంచి నా మనస్సుని మర లించుకోలేక పోయాను.

మానసిక శాంతి కోసం గ్రంథ పఠనంలో పడ్డాను. అందువల్ల సాహిత్యం మీద అభిమానం ఏర్పడింది. రచనా వ్యాసంగంలో మునిగిపోయాను, అందులో నిమగ్న మైనా కూడా సువర్చలే అడుగడుగునా దర్శన మిచ్చేది. నా కవితల్లో, కథల్లో, వివిధ రూపాల్లో సువర్చలే ప్రతి బింబించ సాగింది.

ఒక విధంగా నాకు సువర్చల మూలంగా లాభమే జరి గింది. ఆమెకి దూరమవడం కోసం సాహిత్య రంగంలో ప్రవేశించాను. సాహిత్య రంగంలో పేరు రావడంవల్ల ఒక ప్రముఖ పత్రికకు ప్రత్యేక విలేఖరిగా ఉద్యోగం దొరికింది.

లేకుంటే ఈ సిఫార్సుల యుగంలో, ఈ డబ్బు మడు పుల వ్యవహారంలో, ఆవి రెండూ లేని నాకు ప్రభుత్వ ఉద్యోగం దొరికేదే కాదు. భారతీయ నిరుద్యోగుల జాబి తాలో నేను కూడా శాశ్వతంగా చేరిపోవలసి వచ్చేది. అందుకే అంతర్యంలో ఆమెకి కృతజ్ఞతలు చెప్పుకోకుండా ఉండలేను.

ఆమెవైపు మరొకసారి పరిశీలనగా చూశాను. గాలికి నుదిటిమీద తమాషాగా కదులుతున్న ఉంగరాల ముంగు రులు. పెళ్ళికి దిద్దిన చుక్కలా, ఆకర్షణీయమైన బుగ్గమీది బ్యూటీ స్పాట్. మోహనత్వం తొణికిసలాడే చక్రాల్లాంటి పెద్ద కళ్ళు—ఈమె అయస్కాంత కాంత; ఈమె అంద చందాలు అప్పటికీ, ఇప్పటికీ అతిశయించాయే గాని ఏ మాత్రం తగ్గలేదు. రంగులో ఒక చాయ తక్కువయినా, ఆకర్షణలో, అలంకరణలో అద్వితీయంగా ఉంది. మనిషి బొద్దుగా ముద్దొస్తూంది. వైలెట్ కలర్ జార్జెట్ సిల్కు చీర, గిరి సానువుల మీద సుకుమారంగా పరుచుకునే మేఘంలా, ఆమె యవ్వన నిమ్నోన్నతాల మీద సొగసులు ద్విగుణీకృతం చేస్తూ అపురూపంగా అమరి పోయింది.

నేను దిగ్భ్రమతో ఆమెవైపు ఆలోచిస్తూండి పోయాను చాలా సేపు.



కళాకార సమాఖ్య కళాకారులకు పరిచయం చేయబడ్డ దృష్ట్యా ప॥ గోదావరి జిల్లా, తాడేపల్లి గూడెం వాస్తవ్యు రాలు శ్రీమతి కె. విజయశ్రీ భాగవతారిణిగార్కి సిద్ధి వినాయక నవరాత్రుల సందర్భంగా ఆమె హరికథ యల మంచిలిలో ఏర్పాటు చేశారు. ఎంతో మంది ప్రముఖులు ఆమెను అభినందించారు.

యలమంచిలి కళాకార సమాఖ్య పరిషత్‌లో ద్వితీయ శ్రేణిలో బహుమతి అందుకున్న శ్రీమతి కె. విజయశ్రీ భాగవతారిణి గవర్నమెంట్ స్కాలర్ షిప్ హోల్డర్. చంద్రహాస - వీరబ్రహ్మేంద్ర చరిత్ర, శివ పీరులు వంటి హరికథలు చెప్పగలిగే చక్కని భాగవతారిణిగా గుర్తించ బడటం హర్షించదగ్గ విషయం....

కళాజీవికి తోడ్పాటు నివ్వండి. మన ప్రాచీన సాంప్ర దాయ కళలకు మరల చేయూత నివ్వండి. పోగొట్టుకున్న కళా విలువలను నిలబెట్టండి.



"భలే వారే! అలా విస్తుపోయి చూస్తున్నారేం.... మాటా పలుకూ లేకుండా. నేను పూర్వపు సువర్చల నేనండి! మనసు విప్పి మాట్లాడండి!" అంది సువర్చల ఉత్సాహంగా.

"నువ్వు ఇంక జీవితంలో నాకు కనిపించవేమోనని అనుకున్నాను! నీ అనుగ్రహం పొందే అదృష్టం నాకు లేదేమోనని నిరాశ చెందాను!" నేను అప్రయత్నంగానే ఆ మాటలు అనేశాను.

"అలాగా పాపం! అంతటి అనురాగం నా మీద వున్న వారు అప్పుడు కాలేజీలో దగ్గరగా వున్నప్పుడు ఏం చేశారు?" ఒక్కసారన్నా హృదయం విప్పి మాట్లాడారా?" ఆమె ఆదరంగా మాట్లాడింది.

"అప్పుడా? అప్పుడు నా మనసు గురించి నాకే అంతగా తెలీదు. నువ్వు అనుకోకుండా స్టడీ మానేసి, అక్కడినుంచి వెళ్ళిపోయాకే, నీ మీది ఆకర్షణ, నీ ప్రాముఖ్యత తెలిసి వచ్చాయి. కాని ఏం ప్రయోజనం! నువ్వెక్కడున్నావో తెలియదు. ఏం చేస్తున్నావో తెలీదు. అప్పట్లో నీకోసం అదే పనిగా పిచ్చిగా ఆలోచించే వాడ్ని. అమితంగా బాధ పడే వాడ్ని. ఇప్పటికీ నిన్ను మరచిపోలేదు. నీ కోసం నా హృదయం ఎప్పుడూ అన్వేషిస్తూనే వుంది." నేను చెప్పుక పోతున్నాను.

"అలాగా? ఏం చేస్తాం? అంతా పరిస్థితుల ప్రాబల్యం! అప్పట్లో మా నాన్నగారు హఠాత్తుగా చనిపోవడంతో, మా కుటుంబం బాధ్యత నేను వహించాల్సి వచ్చింది. అందుకోసం చదువుకు స్వస్తి పలికి, మరో చోటికి వెళ్ళి టీచర్ ట్రైనింగ్‌లో చేరిపోయాను. ఆ తర్వాత ఈ మూరు మూల అడవి ప్రాంతంలో ఉద్యోగం వచ్చింది. ప్రస్తుతం మాకు శీతాకాలం సెలవులు. మా స్వగ్రామం వెళ్ళిపోతున్నాను. ఇన్నాళ్ళకయినా, ఈ విధంగా మనం కలుసుకున్నందుకు నాకు చాలా సంతోషంగా వుంది." ఆమె ఆర్ద్రంగా నా కళ్ళలోకి చూసింది.

నన్నేదో పరవశత్వం ముంచి వేస్తున్నట్లనిపిస్తోంది.

ఆమె మరింత నాకు దగ్గరికి జరిగింది. ఆమె పైట చెంగు గాలికి రెపరెప లాడుతూ నాకు తాకుతూ కిత-కితలు పెడుతూంది.

అలా ఆమె సరసన కూర్చుని ఆమెతో అలా మాట్లాడుతూండడం ఎంతో హాయిగా వుంది. మరేదో లోకంలో ఆహ్లాదంగా తేలి పోతున్నట్లుంది.

"ఇంతకీ చెప్పారు కాదేం మీ విషయం? ఏం చేస్తున్నారు? ఎక్కడుంటున్నారు?" ఆమె అడిగింది.

"ఒక పత్రికకి రిపోర్టరుగా పని చేస్తున్నా!" అంటూ నా వివరాలు చెప్పాను.




మేము అతి నూతనమైన యంత్రసాధనములను అమర్చి అతి సరసమగు, అత్యాకర్షణీయముగా, నేత్రానందకరమైన జంకాణాలు మరియు బెడ్‌షీట్లను తయారించుచున్నాము. మహాశయులు మాకు చేయూతనిచ్చి అత్యధికముగా ఆర్డరు ఇవ్వవలెనని కోరుచున్నాము. మీ ఆర్డరును వెంటనే గమనించి సప్లయి చేయుదుము.

(ఉత్తర ప్రత్యుత్తరాలు ఇంగ్లీషులోనే)

**Sivakumar Industrials**

BHAVANI – 638 301.

P. B. No. 38 Phone No. 265

"సరే గాని, సౌమిత్రీ! ఇటీవల ఒక పత్రికలో నీ కథొకటి చదివాను - 'బ్యూటీ స్టార్'. దానికి ఇన్స్పిరేషన్ ఎవరు?" ఆమె ఆసక్తిగా అడిగింది.

"నా రచనలు చదువుతున్నావా?" నేను ఆశ్చర్యంగా అడిగాను.

"అప్పుడప్పుడు చదువుతున్నాను. కాని వాటి రచయిత నా కాలేజీ మేట్ ఈ సౌమిత్రే అనుకోలేక పోయాను మొదట. అది మరెవరిదో కలం పేరు కావచ్చనుకున్నాను. కాని మొన్నటి 'బ్యూటీ స్టార్' చదివాక—ఆ సౌమిత్రి నువ్వే అనుకున్నాను." అంది సువర్చల.

"ఎందువల్ల?" నా ప్రశ్న.

"ఆ కథలో బుగ్గమీద పుట్టుమచ్చనీ, ఉంగరాల జుత్తునీ అంత ప్రామాణ్యంగా వర్ణించడం - నాకు పరిచయమైన సౌమిత్రికి తప్ప మరొకరికి సాధ్యం కాదనిపించింది. ఏమంటారు?" ఆమె నవ్వుతూ, కవ్వించే కళ్ళతో సగర్వంగా అంది.

ఆమెను కొంచెం తమాషా పట్టించాలనుకున్నాను.

"అలా ఎందుకు భావించాలి? నేనే కాదు, ఏ శాస్త్ర చేయి తిరిగిన రచయితైనా అలా వర్ణించి రాయగలడు." అన్నాను.

"అసంభవం! అది చాలా వాస్తవికంగా వుంది.... అనుభవాత్మకంగా వుంది. అది మీరు తప్ప మరొకరు వ్రాయడానికి అవకాశం లేదు." ఆమె దృఢంగా అంది.

"మంచి కథకు డెవరైనా వాస్తవానికి దగ్గరగా, అనుభవాత్మకమని భ్రమించేలా రాయగలడు. అదే సాహిత్య కళ! అలా కానినాడు ఆ సాహిత్యాన్ని పాఠకులు చదవలేరు!" అన్నాను.

"అయితే కావచ్చు. కాని ఈ కథలో మాత్రం వాస్తవ జీవితంలోని ఎవర్నో ఒకర్ని ప్రత్యేకంగా దృష్టిలో పెట్టుకునే ఆ కథానాయకుని చిత్రించారు - మీరు. అది స్పష్టంగా తెలుస్తూనే వుంది. మీరు నన్ను బుకాయించకండి!" అంది సువర్చల కొంటెగా నా వైపు చూసి నవ్వుతూ.

"అయితే ఆ కథ నిజమే నంటావా!"

"కొంత కల్పన వుంది. కాని ఆ కథానాయిక సృష్టికి నిజ జీవితంలో తటస్థపడిన స్త్రీయే ఇన్స్పిరేషన్!"

"అలాగే అనుకో!" నేను నవ్వుతూ అన్నాను.

"ఆమె ఎవరో చెప్పండి?" ఆమె అడిగింది.

"నువ్వే తెలుసుకో!"

"తెలిస్తే మిమ్మల్నెందుకు అడుగుతాను?"

"నా నోటి మీదుగా చెప్పిద్దామనికదూ! అయితే విను. ఆమె నువ్వే....!"

"అయితే చాలా థాంక్స్!" అంది.

"ఒట్టి థాంక్సేనా?" ఆమె వైపు ఆశగా చూశాను.

ఆమె అటూ ఇటూ చూసింది. జనం మా వైపెవ్వరూ చూస్తున్నట్లు లేదు. క్యాబిన్ కిటికీకి దూరంగానే వున్నాం కూడా.

ఆమె హఠాత్తుగా నా వైపు తిరిగి, నన్ను దగ్గరకు లాక్కుని నా నుదిటిమీద జారగా, ప్రేమగా ముద్దు పెట్టుకుంది. ఆమె వెచ్చని ఊపిర్లు నా చెంపలకు గిలిగింతలు పెట్టాయి. ఆమె పయ్యెద కింద బరువుగా, ఉన్నతంగా ఎగసి పడుతున్న సౌందర్య శిఖరాలు సూటిగా నా గుండెల్ని తాకి, విద్యుత్తరంగాలు రేపాయి.

ఆమె మీద కథ రాసినందుకు, ఆమె ఇచ్చిన ఈ 'మధుర బహుమతి' నాకు జీవితాంతం అమృత స్మృతి!

ఫోన్ నెం. 21386 ఆఫీసు : 23243



Saradha
—KNITTING MILLS—
TIRUPUR—638 602.